క్లుప్తంగా

ఆలయంలో గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు నూతనంగా నిర్మించిన గోశాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవు మన సంప్రదాయానికి, ఆధ్యాత్మికతకు, వ్యవసాయానికి ప్రాణాధారం అన్నారు. ఇటువంటి గోశాలలు సమాజానికి పెద్ద వరంగా నిలుస్తాయన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి



అధ్యక్షుడు అంకిత్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: కాలనీల సమస్యల పరిష్కారానికి సంక్షేమ సంఘాలు కృషి చేయాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. మంగళవారం తులసినగర్ సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్‌ను కలిశారు. నూతన కమిటీని కార్పొరేటర్ సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంకిత్, డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, పాండుయాదవ్, విజయ్‌కుమార్, జ్ఞానేశ్వర్, బ్రహ్మం, మల్లికార్జున్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్న నగర్ కాలనీ వాసులు పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంగళవారం పీఏసీ చైర్మన్ గాంధీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ.. త్వరలోనే కాలనీలో పర్యటిస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, కమలప్రసన్న నగర్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ తిరుపతి, జాయింట్ సెక్రటరీ బండప్ప, రాఘవులు, ఆర్గనైజర్ వెంకటేష్, సుబ్బారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ముగ్గురికేనా?

జిల్లా వ్యాప్తంగా వారికే కార్యవర్గంలో చోటు

- ఆ రెండు నియోజకవర్గాలకు దక్కని ఛైనం
- ప్రధాన కార్యదర్శిగా పీసరి మహిపాల్‌రెడ్డి
- ఉపాధ్యక్షులుగా బొంతు రామ్మోహన్, బండి రమేష్



బొంతు రామ్మోహన్ (ఉప్పల్, ఉపాధ్యక్షుడు)



బండి రమేష్ (ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి)



పీసరి మహిపాల్‌రెడ్డి (మేడ్చల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి)

కుత్బుల్లాపూర్: తెలంగాణ పీసీసీ జంబో కార్యవర్గంలో మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఏ ఒక్కరికీ అవకాశం కల్పించకపోవడంతో కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాలు ఉండగా కేవలం మూడు నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులకు చోటు కల్పించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పిసరి మహిపాల్‌రెడ్డి, ఉప్పల్ నుంచి బొంతు రామ్మోహన్, కూకట్‌పల్లి నుంచి బండి రమేష్‌లకు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చోటు కల్పించి మిగతా రెండు నియోజకవర్గాల్లో ఏ ఒక్కరికీ అవకాశం కల్పించలేదు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మంగళవారం 27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులను ఎంపిక చేశారు. రెండు నియోజకవర్గాల్లో నాయకులు టీపీసీసీ కార్యవర్గంలో చోటు దక్కుతుందని ఎంతో ఆత్రుతగా ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నలుగురికి ప్రధాన కార్యదర్శులుగా అవకాశం కల్పించి ఈసారి అధిష్టానం మొండి చేయి చూపడంపై అయోమయంలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో పాటు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కొలను హనుమంత్‌రెడ్డిలకు పదవులు వస్తాయని ఆశించారు. అదేవిధంగా మల్కాజిగిరి అసెంబ్లీ నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగిస్తుందని భావించి నిరుత్సాహానికి గురయ్యారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు సైతం టీపీసీసీ కార్యవర్గంలో చోటు దక్కుతుందన్న ఆశతో ఉన్నప్పటికీ ఫలితం తారుమారైంది.

మేడ్చల్ అసెంబ్లీ నుంచి యువకుడికి అవకాశం

మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన పీసరి మహిపాల్‌రెడ్డి పార్టీ అధికారంలో లేనప్పటికీ అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థి సంఘం నాయకుడిగా యూత్ కాంగ్రెస్ పక్షాన ఎన్నో ప్రజా సమస్యలపై పోరాడుతూ వచ్చాడు. 2006లో ఎన్‌ఎస్‌యుఐలో కీలకంగా పనిచేసి శామీర్‌పేట్ మండల అధ్యక్షుడిగా, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మేడ్చల్ అసెంబ్లీ అధ్యక్షుడిగా కొనసాగారు. 2015 సంవత్సరంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీచేసి ప్రస్తుత ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చేతిలో స్వల్ప ఓట్లతో ఓటమి పొందారు. యువకుడిగా ఉన్న మహిపాల్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన కార్యవర్గంలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించి గుల్బర్గా జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా పంపారు. అదేవిధంగా జూబ్లీహిల్స్, నల్లగొండ జిల్లాలో ఎలక్షన్ సమయంలో పరిశీలకులుగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేషన్ చైర్మన్ పదవి వస్తుందని జిల్లావ్యాప్తంగా చర్చ జరిగినా ఆ పదవి వరించలేదు. యువకుడిగా చురుగ్గా పనిచేస్తున్న మహిపాల్‌రెడ్డి పేరును రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రతిపాదించినట్లు తెలిసింది. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి గతంలో పోటీ చేసి ఓడిపోయిన బండి రమేష్, ఉప్పల్ సీటు ఆశించి భంగపడ్డ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు ఉపాధ్యక్ష పదవులు కట్టబెట్టారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కూకట్‌పల్లి: కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆస్‌బెస్టాస్ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక ప్రజలు వివిధ సమస్యలను వివరించారు. వీధి దీపాలు, నూతన రోడ్డు ఏర్పాటు చేసిన అనంతరం మ్యాన్‌హోల్ రోడ్డుకు సమాన ఎత్తులో ఏర్పాటు చేయకపోవటం వల్ల అక్కడక్కడ గుంతలుగా ఏర్పడుతున్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. నూతన వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్ల కోసం అభ్యర్థించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ ప్రసన్న, వాటర్ వర్క్స్ మేనేజర్ సతీష్, పెన్షన్ ఆఫీసర్ సీఓ సుజాత, వీధిలైట్లు భద్రయ్య, జీహెచ్‌ఎంసీ ఎస్‌ఆర్‌పీ వినయ్‌కాంత్ రెడ్డి, ఎంటమాలజీ నరేష్, ఆర్టికల్చర్ ప్రియాంక, కాలనీ అధ్యక్షులు నరేష్, డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సంతోష్, సీహెచ్. ప్రభాకర్‌రావు, రఫీ, మున్నా, దీపక్, పుష్ప, లక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు

నేడు హౌసింగ్ బోర్డు స్థలాల వేలం

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలోని పలు ఇళ్ల స్థలాలు, కమర్షియల్ స్థలాలకు బుధవారం బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు వెస్ట్రన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్ బాబు తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాప్ సమీపంలోని హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 11 నుంచి వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడవ ఫేజ్‌లోని సుమారు 17 ప్లాట్లకు, కైత్లాపూర్ వద్ద ఒక ప్లాట్‌కు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు హౌసింగ్ బోర్డు పేరిట ఏదైనా జాతీయ బ్యాంకు జారీ చేసిన పది లక్షల డిమాండ్ డ్రాఫ్టును తీసుకొని వేలానికి గంట ముందు వచ్చి డీడీలను అధికారులకు ఇవ్వాలని కోరారు. గతంలో నిర్వహించిన వేలం పాటలో గజం ధర లక్షా ఎనభై వేలకు పైగా పలుకగా బుధవారం జరిగే వేలంలో ఎంత ధర పలుకుతుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాలానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

బాలానగర్: ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి డివిజన్‌లోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. దిల్‌ఖుష్‌నగర్‌లోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా విద్యుత్ హైటెన్షన్ లైన్ల సమస్య, డ్రైనేజీ వ్యవస్థ గురించి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేశారు. అనంతరం బాలానగర్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన అన్ని విభాగాల అధికారులు, అసోసియేషన్ సభ్యులతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం రాజు కాలనీలో రోడ్డు సమస్య, ఇతర కాలనీలో డ్రైనేజీ, విద్యుత్, వీధిలైట్లు వంటి సమస్యలను ఎమ్మెల్యేకు ప్రజలు వివరించారు. ఆయా సంబంధిత విభాగ అధికారులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అయోమయంలో ఉన్నారని, వారికి ప్రభుత్వం నుంచి తగిన వివరణ ఇవ్వాలని అధికారులకు తెలిపారు. పది ఏళ్ల కాలంలో బాలానగర్‌ను ఎంతో అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. ఫ్లై ఓవర్లు, రోడ్లు, మంచినీటి పైపులైన్లు ఇలా అన్ని రకాల మౌలిక సదుపాయాలతో డివిజన్‌ను తీర్చిదిద్దామని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి మాట అటు ఉంచితే నిధులు మంజూరైన పెండింగ్ పనులను కూడా పూర్తి చేయటం లేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రజలకు ఎక్కడా కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, అసోసియేషన్ నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌కు మూతల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌తో ప్రమాదం పొంచి ఉంది. మూతలు లేకుండా శిథిలావస్థకు చేరుకున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌తో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఈ నెల 9న సాక్షిలో 'పొంచి వున్న ప్రమాదం' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఆల్విన్‌కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు కొత్త మూతలు ఏర్పాటు చేశారు. సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



కథనానికి ముందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్



కథనం తర్వాత మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసిన మూత